ప్రజాశక్తి

మంగళవారం 16 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు
- జగ్గయ్యపేటలో యుటిఎఫ్ 'రణభేరి' ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామ

కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటీ పరిష్కారం కాలేదని మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ చేపట్టిన 'రణభేరి' జాతాను ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. జాతా జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు, గౌరవరం మీదుగా నందిగామ, కంచికచర్ల, పరిటాల, మూలపాడు, విజయవాడ ఎకెటిపి స్కూల్, గాంధీ మున్సిపల్ హైస్కూల్ వరకు సాగింది. ప్రారంభ సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డిఎలు, పెండింగ్‌లో ఉన్నాయని, దసరాకు కనీసం రెండు డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషనర్‌ని నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. (మిగతా 2లో)

అదుపులోకి రాని అతిసార

- ఇంకా కొత్త కేసులు నమోదు
- నేటికీ 60 మందికి చికిత్స
- ఇళ్లకు వెళ్లి తిరిగి వస్తున్న కేసులు అనేకం
- అతిసారకు పోటీగా విషజ్వరాలు నమోదు
- న్యూఆర్‌ఆర్‌పేటలో కర్ఫ్యూ వాతావరణం



ప్రజాశక్తి-విజయవాడ: న్యూఆర్‌ఆర్‌పేటలో వారం రోజులు గడిచినా అతిసార అదుపులోకి రాలేదు. ఇంకా కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. జిజిహెచ్‌లో, కేర్ అండ్ షేర్ ఉచిత వైద్యశిబిరంలో 60 మందికి చికిత్స అందిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని తెలిపారు. అతిసార కొంత అదుపులో ఉన్నట్లు జిల్లా వైద్యాధికారులు వెల్లడిస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేటు వైద్యశాలల్లో చేరి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నా వారు, ఇంకా వచ్చి చేరుతున్న వారి సంఖ్యను పరిశీలిస్తే ఇప్పుడే సాధారణ స్థాయికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని తెలుస్తుంది. దుకాణాలు, పాఠశాలలు ఇంకా మూసే ఉండటంతో ఆర్‌ఆర్‌పేటలో కర్ఫ్యూ వాతావరణం కొనసాగుతుంది. ఒక వైపున అతిసార, మరొక వైపున విషజ్వరాలతో డివిజన్ ప్రజలు బెంబేలెత్తుతున్నారు.



న్యూఆర్‌ఆర్‌పేటలో కర్ఫ్యూ వాతావరణం


... వార్తలు 5వ పేజీలో

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

కృష్ణాజిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే తన ధ్యేయమని కృష్ణాజిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా నూతన ఎస్‌పిగా వి.విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2016లో ఇండియన్ పోలీస్ సర్వీస్ ద్వారా పోలీస్ శాఖలోకి అడుగుపెట్టి అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చింతపల్లి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ విశాఖపట్నం, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గ్రేహౌండ్స్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అన్నమయ్యగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై కృష్ణాజిల్లాకు వచ్చిన ఆయనకు పోలీస్ సిబ్బంది (మిగతా 2లో)



కౌలు రైతులకు షూరిటీ లేకుండా రుణాలివ్వాలి

ధర్నాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి

ఎపి ఫైబర్ నెట్ ఎమ్‌డిగా గీతాంజలి శర్మ



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గీతాంజలి శర్మ బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పలువురు ఐఎఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో జిల్లా జాయింట్ కలక్టర్‌గా పనిచేస్తున్న గీతాంజలి శర్మను ఏపీ ఫైబర్ నెట్ ఎమ్‌డిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రెండు సంవత్సరాలు పాటు గీతాంజలి శర్మ జిల్లాలో విధులు నిర్వర్తించారు.

నేటి నుంచి మండలస్థాయి పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలో మండల స్థాయి స్కూల్ గేమ్స్(ఎస్ జి ఎఫ్ ఐ) పోటీలు ఈనెల 16,17 తేదీల్లో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ 2 అన్నపురెడ్డి పిచ్చయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అండర్ 14 అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు ఆటల క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 16వ తారీఖున బాలికలకు 17వ తేదీన బాలురకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో కబడ్డీ కోకో వాలీబాల్ షటిల్ బ్యాట్మెంటన్ చెస్ యోగ అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 949 430568, 9885750875 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ముగిసిన జెసిఐ వారోత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9-15 తేదీలలో దేశవ్యాప్తంగా నిర్వహించే జెసిఐ వారోత్సవాలు ఈసారి ప్రిజమ్ - 110గా ప్రత్యేకతను సంతరించుకుంది. సోమవారం స్థానిక జెసిఐ భవనంలో వారాంతర కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, గ్రేట్ డే సెలబ్రేషన్స్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ



సందర్భంగా చార్టర్డ్ అకౌంటెంట్ మండవ మనోజ్‌ను అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్‌గా, జెసి సలీమ్ (ఎంటర్‌ప్రెన్యూర్)ను కమలపత్ర అవార్డులతో సత్కరించారు. అదనంగా పోలీస్ విభాగంలో నాగ విశ్వనాథ్, కానిస్టేబుల్ రామును, ఫైర్ విభాగంలో యోగానంద్, పోస్టల్ విభాగంలో శిరీషలను సైలెంట్ స్టార్స్‌కు అవార్డులను అందజేశారు. క్రీడా కార్యక్రమంలో బ్యాడ్మింటన్ రన్నరప్‌గా నిలిచిన ఉద్వేగ్‌కు పురస్కారం అందజేశారు. జోన్ డైరెక్టర్ జెసి లక్కం రవీంద్ర, లక్కీ జైన్, వంశీ, మోనిష్, అన్నం చిన్నవీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ గోడపత్రిక ఆవిష్కరణ




ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ప్రారంభంకానుందని జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్లోని మీకోసం సమావేశ హాలులో సోమవారం స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగాజిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు రెండు వారాలపాటు నిర్వహించే శిబిరాల్లో 429 కేంద్రాల్లో వివిధ పరీక్షలు, వైద్యసేవలు అందిస్తామన్నారు. జిల్లా రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖాధికారులు, హెల్త్ వెల్నెస్ సెంటర్ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ. వెంకట్రావు మాట్లాడుతూ మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులపై నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. యాన్‌ఎన్‌సీ స్క్రీనింగ్, కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య పరీక్షలు, పాప్స్మియర్ టెస్ట్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ వంటి సేవలను అందుబాటులో ఉంటాయన్నారు.



ఆర్‌ఒ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌ఒ ప్లాంట్స్ ఏర్పాటు చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. మంగళవారం జక్కంపూడి కాలనీలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్‌ఒ ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధమైన తాగునీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జక్కంపూడి కాలనీలో డ్రైనేజీల వద్ద వాటర్ పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార కట్టడాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించి ప్రతిరోజు ఫాగింగ్, యంఎల్ ఆయిల్ స్ప్రే, డ్రోన్ ద్వారా ఖాళీ స్థలాల్లో, డ్రైన్లలో, కాలువల్లో యంఎల్ ఆయిల్ స్ప్రే చేయించాలని అన్నారు. జక్కంపూడి కాలనీలోని బోర్లన్నింటిలో, ప్రైవేట్ ఆర్‌ఒ ప్లాంట్లన్నిటిలోనూ తాగునీటి పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో రసాయనాల పిచికారీ



ప్రజాశక్తి-గుడివాడ: సాంకేతికంగా అందుబాటులోకి వచ్చిన యాంత్రీకరణ వ్యవసాయంతో రైతాంగానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడివాడ రూరల్ మండలం తట్టివర్రు గ్రామంలో డ్రోన్ సహాయంతో వరి పొలంలో రసాయనాల పిచికారి విధానాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. డ్రోన్ ద్వారా ఫెస్టిసైడ్స్ స్ప్రే చేయడంతో కలిగే ప్రయోజనాలను వ్యవసాయ శాఖ అధికారులు రైతాంగానికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద, రైతాంగ వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం డ్రోన్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఐదుగురు రైతులు గ్రూప్‌గా కలిసి వస్తే 10 లక్షల విలువ ఉండే డ్రోన్ 8 లక్షల సబ్సిడీతో ప్రభుత్వమే అందిస్తుందన్నారు. సర్పంచ్ నిర్మలకుమారి, వ్యవసాయ శాఖ అధికారులు ఎస్ కవిత, అనంతలక్ష్మి, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, టిడిపి అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఉమ్మడి సర్వీస్ నిబంధన విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం వల్ల సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో పాటు అన్ని తాత్కాలిక నియామకాలు చేయడంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడిందని తెలిపారు. రిటైర్ అయిన ఉద్యోగులకు గత అక్టోబర్ నుంచి గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. నందిగామలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యా రంగ విధానాలపై కూటమి ప్రభుత్వ వైఖరి స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తక్షణమే తొలగించాలని, 12వ పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పరీక్ష విధానం పేపర్స్ మీద కాకుండా బుక్స్ రాయించే విధానం పిల్లలకు పరీక్షగా కాకుండా ఉపాధ్యాయులకు పరీక్షగా మారిందని, పాత విధానంలోనే పరీక్ష రాయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్పి మనోహర్‌కుమార్, కె.ఉమామమహేశ్వరరావు మాట్లాడుతూ సరెండర్ లీవ్ బకాయిలు నాలుగు సంవత్సరాల నుంచి చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఆన్లైన్ పనులతో విలువైన బోధన సమయం దుర్వినియోగం అవుతుందని, ఆన్లైన్ పనులు సచివాలయ ఉద్యోగులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య, సహాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య, సహాధ్యక్షురాలు పి.లీల, మహేశ్వర వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.గంగరాజు, డి.హరిప్రసాద్ , బి.రెడ్ స్టార్, జె.సుధానంద్, షేక్ ప్రైమర్ సాహెబ్, సూర్యనారాయణ, లింగా రెడ్డి, పి.భవాని, అనంత కుమార్, జే.గంగరాజు, ఎ.గోపాలకృష్ణ, కె.నాగేశ్వరరావు, ఎ.భరత్, లలిత శ్రీ, దేవ్, జగ్గయ్యపేట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.నరసింహారావు, జి ముక్తేశ్వరరావు, కంచికచర్ల నాయకులు కె.నాగేశ్వరరావు, కె.ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని, విద్యార్థి దశ నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు గంజాయిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు జిల్లాలోకి ప్రవేశించకుండా ఉక్కుపాదం మోపుతామన్నారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడంలో ప్రత్యేక పాత్రను పోషిస్తానని పేర్కొన్నారు ప్రజా సమస్యల పరిష్కారంలో, మహిళలకు భద్రత పెంచడంలో, సైబర్ నేరాలను నియంత్రించడంలో రాజీ పడేది లేదన్నారు. ఎంతో ప్రఖ్యాత చరిత్ర కలిగిన కృష్ణాజిల్లాకు ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాను నేర రహితంగా తీర్చిదిద్దేందుకు సిబ్బందిని ఎల్లవేళలా అప్రమత్తం చేస్తూ, సిబ్బంది సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా ముందుంటానని, 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌పిని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వివి నాయుడు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి సత్యనారాయణ, డిఎస్పీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందిస్తున్న చైర్‌పర్సన్ హారిక

13 మందికి ఎంపిడిఓలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లాలో జిల్లా పరిషత్ పరిధిలో వివిధ హోదాలలో పనిచేస్తున్న 13 మందికి మండల పరిషత్ అభివద్ధి అధికారులుగా పదోన్నతి కల్పించిన ఉత్తర్వులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అందించారు. సోమవారం చైర్ పర్సన్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పదోన్నతి ఉత్తర్వులు అందించారు. పదోన్నతి పొందిన వారిలో నలుగురు ఏ ఓ,లు తొమ్మిది మంది ఈ ఓ ఆర్‌డిలు ఉన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు తదితరులు ఉన్నారు.

గ్రామీణ కీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-గన్నవరం : పల్లెల్లోనే నిజమైన క్రీడా ప్రతిభ దాగి ఉన్నదని శిక్షకులు వెలికి తీసి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు అన్నారు. 69 వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 14,17 బాల బాలికల జిల్లా స్థాయి రాగబి ఎంపికలు గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి విచ్చేసిన సౌజన్య మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభ కుపాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఏ. సునీల అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సునీల,కృష్ణా, యన్. టి. ఆర్ జిల్లాల కార్యదర్శులు అరుణ, రాంబాబు, దుర్గారావు, న్యాయవాది టి. వెంకయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే.వి.ఆర్. కిషోర్, రాగబీ సంఘం జిల్లా చైర్మన్ మడుపల్లి బాలకృష్ణారావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష ధోరణి అవలంభిస్తూ కార్మిక సంఘాలు గతంలో సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీచేస్తున్నాయని 1104 ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం. మోహన్ రావు ఆందోళన వ్యక్తంచేశారు. దీర్ఘకాలిక సమస్యల సాధనకై ఎపీస్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ, రాష్ట్ర జేఏసీ పిలుపుమేర దశలవారీ ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉయ్యూరులో ఏడీఈ, ఏఈ కార్యాలయాల వద్ద ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 327 యూనియన్ , 1104 ఎంప్లాయిస్ యూనియన్ నాయ కులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తూ గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలు ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీచేస్తు న్నాయని ఆరోపించారు. యూనియన్ల నాయకులు జి.నాగరాజు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, సురేశ్, కాంట్రాక్ట్ కార్మికుల రీజినల్ ప్రెసిడెంట్ పామర్తి ఆంజనేయులు, ఉయ్యూరు డివిజన్ ప్రెసిడెంట్ సురేశ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'మీకోసం' అర్జీలు సకాలంలో పరిష్కరించాలి : డిఆర్ఓ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందుతున్న మీకోసం అర్జీలను ఎప్పటికప్పుడు సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. సోమవారం నగరం లోని కలెక్టరేట్ సమావేశ హాలులో డిఆర్ఓ, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, సర్వ శిక్ష ప్రాజెక్ట్ అధికారి కుమిదిని సింగ్ లతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలను నుండి అర్జీలను స్వీకరించారు. తొలుత డిఆర్ఓ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ అర్జీలు పరిష్కరించే అధికారి(జి ఆర్ ఏ)తప్పనిసరిగా అర్జీదారునితో మాట్లాడి అతని సమస్య పరిష్కారం అయ్యిందా లేదా విచారిం



చాలన్నారు. ఆ విధంగా చేయడం వలన కొంతవరకు అర్జిదారులలో సంతప్తి వ్యక్తం అవుతుం దన్నారు. మొత్తం 166 అర్జీలు అందినట్లు కలక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. డి ఆర్ డి ఏ పి డి హరిహరనాథ్, డీఎస్ఓ మోహన్ బాబు, డి ఎం హెచ్ ఓ ఏ వెంకటరావు, రహదారులు భవనాల ఈఈ లోకేష్, డీఈవో పి వి జె రామారావు, డిపిఓ అరుణ, మార్కెటింగ్ ఏడి నిత్యానందం పాల్గొన్నారు.

రజకులపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్రంలో రజక సంఘీయులపై జరుగుతున్న దాడులను అరికడుతూ, రజకులకు రక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘ ప్రధాన కార్యదర్శి చిక్కవరపు వెంకటరెడ్డయ్య కోరారు. సోమవారం స్థానిక జగన్నాధపురంలోని గుడివాడ పట్టణ రజక సంఘం అధ్యక్షుడు నైనవరపు శేషుబాబు స్వగృహంలో సంఘీ యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘీ యులపై జరుగుతున్న దాడులను సంఘ పెద్దలు ఖండించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకట రెడ్డయ్య, రజక సంఘ రాష్ట్ర నాయకులు పెనుమూడి నాగేశ్వరరావు, ఓలేటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బీమవరపు ఉమశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యుటిఎఫ్ ఉచిత ఈ-ఫైలింగ్ క్యాంపు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలోని ప్రాధమిక, ప్రాధమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సమీప మండల ఉపాధ్యాయులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్కమ్ టాక్స్ ఈ ఫైలింగ్ క్యాంపు సోమవారం ముగిసింది. దాదాపు 153 మందికి ఉచితంగా ఈ ఫైలింగ్ చేసినట్లు యుటిఎఫ్ ఉంగుటూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. రాజు, ఎస్ ఏ రాజశేఖర్ తెలిపారు. ఈ క్యాంపు ద్వారా ఈ ఫైలింగ్ చేసిన కార్యదర్శులు ఎల్. బి దేవి, విజయ్ కుమార్, లక్ష్మి ప్రతాప్, నాగబాబు, శ్రీనివాసరావు, లక్ష్మి మధు, జోగిరాజులకు వారు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఉద్యమాభినందనలు తెలియచేసారు. జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, జిల్లా కార్యదర్శి టి.సీతారామయ్య,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రసాదరావు పాల్గొన్నారు.



అనీష్ అహ్మద్ రజా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

న్యాయవాది అహ్మద్ రజాకి నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : సీనియర్ న్యాయవాదిగా విశేష సేవలు అందించి ఆదివారం మరణించిన అనీష్ అహ్మద్ రజాకి సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివి పోతురాజు, కార్యదర్శి సాయన సుధాకర్, సభ్యులు జి శ్రీనివాస్, ఎండి జప్ఫుల్ల కుంపటి ప్రసాద్, తోట విజయ శంకర్, ఎండి ఉస్మాన్ అహ్మద్, మెండు సురేష్ బాబు, పి దేవేంద్ర కుమార్, సైదేశ్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు శివారు స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను పాఠశాల హెచ్ఎం మెండు ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యాయి. సోమవారం కోడూరు ఎస్సై కె.చాణిక్య, మండల విద్యాశాఖ అధికారి టివిఎం రామదాసు,పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో కోడూరు మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపిటిసి సభ్యులు తిమ్మన వెంకట నాంచారయ్య, కోడూరు పిఏసిఎస్ అధ్యక్షులు పూతబోయిన కరుణ కుమార్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ వెన్న గజేంద్రరావు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఎలుకపాడులో అసైన్మెంట్ భూముల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి డిమాండ్ చేశారు. మండలంలోని ఎలుకపాడు అసైన్మెంట్ భూములను ఆన్లైన్ చేయాలని జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 7వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు గుడ్డేటి భూపతి రావు, మల్లాది చక్రి, విశ్వనాథపల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-నందివాడ : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నందివాడ మండలం ఇలపర్రు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఇలపర్రు గ్రామానికి చెందిన కూర్మ వెంకటేశ్వరరావు (26) తన ఇంటి వద్ద నుండి గేదెలను మేతకు తోలుకొని గ్రామ శివారులో ఉన్న చెరువు మీదకు వెళ్ళగా ప్రమాదవశాత్తు చెరువు మీద ఉన్న కరెంటు వైర్లు అతనికి తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె. శ్రీనివాస్ తెలిపారు.

యువకుడు అదృశ్యం



శ్రీనివాసరావు (ఫైల్)

ప్రజాశక్తి-కోడూరు : బహిర్భూమికి అని ఇంటి వద్ద చెప్పి వెళ్లి యువకుడు అదశ్యమైన సంఘటన కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కంతేటి నాగ వెంకట శ్రీనివాసరావు (28) ఆదివారం సాయంత్రం ఉల్లిపాలెం బహిర్భూమికి అని వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. ఉల్లిపాలెం బ్రిడ్జి వద్దకు వెళ్ళగా శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం చెప్పులు కనిపించాయని కిందకి దిగి చూడగా శ్రీనివాసరావు కృష్ణా నదిలో కొట్టుకుపోతూ కనిపించాడని, కాపాడేందుకు ప్రయత్నించగా కంటి ముందే కొట్టుకుపోయాడని శ్రీనివాసరావు తండ్రి నాగ బసవయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు కోడూరు ఎస్సై చాణిక్య తెలిపారు. బసవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం కష్ణా నదిలో ఎన్డీఆర్ఎఫ్ బందాలచే గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.



ఆక్వా రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : కేంద్ర ప్రభుత్వం ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే భరోసా ఇవ్వాలని, ఆక్వా రైతాంగాన్ని వ్యవసాయ రంగం గా గుర్తించి బీమా పథకాన్ని ఇతర రాయితీలు ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లి తహశీల్దార్‌కు, కృత్తివెన్ను మండలం ఇన్చార్జి తాసిల్దార్ లక్కప్రగడ శేశీ కుమార్‌కు ఆక్వా రైతులు వినతిపత్రం అందించారు. అలాగే ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్ ఫీడ్ మందులు సబ్సిడీ ధరలకు అందించాలని, విద్యుత్తు రాయితీ ఇవ్వాలని, మార్కెట్ యార్డులో సొసైటీలో శీతల గిడ్డంగులు నిర్మించి రైతాంగానికి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరి శెట్టి నాగేశ్వరావు, కోమలపూడి సర్పంచ్ ప్రత్తిపాటి రామాంజనేయులు, ఆక్వా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాశం కష్ణ, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ పులగం సుబ్రహ్మణ్యం, రైతు సంఘం సీనియర్ నాయకులు పుప్పల నరసింహారావు, పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏఐటియూసి ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్స్ ఆందోళన చేపట్టారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏఐటియుసి నాయకులు గూడపాటి ప్రకాష్‌బాబు, సిహెచ్ సత్యనారాయణలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మెడికల్ డిపార్ట్మెంట్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కి కాంట్రాక్టర్ గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, రాణి, నాగఆంజనేయులు, వర్కర్స్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్న వరం) : బాపులపాడు మండలం బడారుగూడెం గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం నిరుపయోగంగా పడి ఉంది. గత 10 సంవత్సరాలుగా అంగన్వాడి బిల్డింగ్‌ను ఉపయోగించకుండా పాడు పెట్టారు. లక్షల రూపాయలతో కట్టిన కేంద్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖాళీగా ఉందని గ్రామస్తులు చెప్తున్నారు అధికారులు స్పందించి అంగన్వాడి బిల్డింగ్ సమస్య పరిష్కరించాలని సిపిఎం నాయకుడు బర్రె లెనిన్ డిమాండ్ చేశారు.



నిరుపయోగంగా ఉన్న కేంద్రం

జాన్‌వెస్లీకి ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి-గన్నవరం : పాన్ ఇండియా ఎడ్యుకేషన్ ప్రతిభ అవార్డు గన్నవరం మండలం గొల్లనపల్లి లైట్ హౌమ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ జీవశాస్త్రం ఉపాధ్యాయులు ఇరుగు జాన్ వైస్లిని వరించింది. అవార్డు పొందిన జాన్ వైస్లిని లైట్ హౌమ్ ఇంగ్లీష్ మీడియం డైరెక్టర్ సి. హెచ్ ఎలిషా, ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న జాన్‌వెస్లీ

మహిళ మృతదేహంతో ఆందోళన

- హిజ్రాలను నగర బహిష్కరణ చేయాలని గాస్పిల్‌హాల్ సెంటర్‌లో ధర్నా
- మద్దతు తెలిపిన సిపిఎం, వైసిపి నేతలు

ప్రజాశక్తి-విజయవాడ

హిజ్రాల దాడిలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన పల్లెపోగు కుమారి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని, దాడికి కారణమైన హిజ్రాలను నగర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేస్తూ 24వ డివిజన్ గాస్పిల్ హాల్ సెంటర్‌లో మృతదేహంతో బైటాయించి సోమవారం ధర్నా చేశారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గిరిపురం వాసులు, సిపిఎం, వైసిపి, ఇతర సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆందోళన నిర్వహించారు. ఉదయం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఆందోళన కొనసాగింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.పది లక్షల ఆర్థిక సహాయం ప్రకటించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలంటూ నినదించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు ఆందోళనకు మద్దతు తెలిపి మాట్లాడారు. స్థానిక 24వ డివిజన్ రెడ్ సర్కిల్ ఏరియాలోని ఇందుపల్లి జయరాజు వీధిలో నివాసముంటున్న పల్లెపోగు కుమారిని హిజ్రాలు అత్యంత దారుణంగా రోడ్డుమీద దాడి చేశారని, తీవ్రమైన అవమాన భారంతో ఆత్మహత్య చేసుకొని చికిత్స పొందుతూ శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించడం అత్యంత బాధాకరమన్నారు. మృతి చెందిన కుమారి కుటుంబానికి తక్షణం ప్రభుత్వం రూ. పది లక్షల సహాయం ప్రకటించాలని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ప్రశాంత వాతారణం వచ్చేంత వరకు ఈ ప్రాంతంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలుతీసుకోవాలని కోరారు. సంఘటన జరిగి నాలుగు రోజులయినా అధికారులు స్పందించకపోవడం అత్యంత దారుణమని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిలో అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ...హిజ్రాల దాడిలో మృతి చెందిన దళిత మహిళ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకొని, తక్షణమే నగరం నుంచి బహిష్కరణ చేయాలని కోరారు. ఘటన పట్ల అధికారపార్టీ ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత, ఎన్‌టిఆర్ జిల్లా ఐద్వా జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు కె. సరోజ,కె. శ్రీదేవి, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గుండిమెడ క్రాంతి కుమార్, సిపిఎం నాయకులు వై.సుబ్బారావు, భవన నిర్మాణ సంఘం నాయకులు బెనర్జీ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు



క్యాపిటల్ ఆస్పత్రిలో విజయవంతంగా 'హై రిస్క్ రీడో హార్ట్' సర్జరీ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతున్న 40 ఏళ్ల వ్యక్తికి మొదటిసారిగా ఎక్కడా జరగని విధంగా పోరంకిలోని క్యాపిటల్ హాస్పిటల్‌లో 'హై రిస్క్ రీడో హార్ట్' సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పిటల్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ హేమ కృష్ణ సాయి తెలిపారు. పోరంకిలోని హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ టంగుటూరుకు చెందిన జాడ మధన్ 2008లో ఎవిఆర్, 2020లో బెలూన్ మైట్రల్ వాల్వో టామీ చేయించుకున్నారని తెలిపారు. అయితే తీవ్రమైన లివర్ ఇన్ఫెక్షన్, గుండె సమస్యతో తమ హాస్పిటల్‌కు వచ్చారన్నారు. తమ హాస్పిటల్‌కు చెందిన అనస్థీషియా వైద్యులు ఎం.శ్రీధర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.ఎస్.ఆర్ భూపాల్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎం.గిరీష్‌తో కూడిన వైద్య బృందం అన్ని జాగ్రత్తలు తీసుకొని శాస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యుల వల్లనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్ మన్నే, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌లో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎడిఎస్‌పి గుణ్ణం రామకృష్ణ రికార్డులను తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలలో భాగంగా స్టేషన్‌లో కేసుల వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలు పరచాలని సిబ్బందికి సూచించారు.



దుర్గమ్మ దర్శనానికి దసరా మొబైల్ యాప్, చాట్ బాట్

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాల సందర్భంగా యాత్రికులు సౌకర్యార్థం రూపొందించిన మొబైల్ యాప్, చాట్ బాట్‌ను దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ఇఒ శీనా నాయక్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సేవలు యాత్రికులకు ఉపయోగపడతాయని తెలిపారు. కాగా 'దసరా 2025' పేరుతో యాప్, 9441820717 నంబర్తో చాట్ బాట్ అందుబాటులోకి వచ్చాయి.

సముద్రంలోకి 3.25 లక్షల క్యూసెక్కుల వరద నీరు



ప్రజాశక్తి -విజయవాడ సిటీ

ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తి 3,25,760 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. కృష్ణా నది వరద నీటి తాజా బులిటెన్ సోమవారం ఉదయం అధికారులు విడుదల చేశారు. డెల్టా సాగునీటి అవసరాలు నిమిత్తం కృష్ణా తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువలకు 10,560 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రకాశం బ్యారేజీ లెవెల్ 12 అడుగులు ఉందని స్పష్టం చేశారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి-వత్సవాయి

కుక్కల దాడిలో మహిళ గాయపడిన సంఘటన మండలంలోని లింగగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. లింగగూడెం గ్రామానికి చెందిన గర్నెపూడి నవ్య అనే మహిళ తన ఇంటి వద్ద ఉండగా ఓ వీధి కుక్క వచ్చి దాడి చేసి ఆమెను గాయపరిచింది. దీంతో బంధువులు ఆమెను వైద్య చికిత్స నిమిత్తం పెనుగంచిప్రోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. లింగగూడెం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువ అయ్యాయని, బెడత బాగా ఉందని, నిర్మూలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి తరలి వెళ్లిన కార్మికులు

ప్రజాశక్తి-విస్సన్నపేట

రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విస్సన్నపేట నుండి భవన నిర్మాణ రంగ కార్మికుల సోమవారం విజయవాడకు తరలి వెళ్లారు. కార్మికుల వాహనాన్ని విస్సన్నపేటలో భవన నిర్మాణ రంగం జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి కూటమి నేతలు కార్మిక సంక్షేమ బోర్డును అమలు చేస్తానని హామీ ఇచ్చారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా కార్మిక సంక్షేమ బోర్డు ప్రారంభించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మిక సంక్షేమం బోర్డును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గంజినిపోయిన రాము, మండల తాపీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ మర్రిబోయిన అప్పారావు, సెక్రెటరీ పోతురాజు శ్రీనివాసరావు, సత్యనారాయణ, షేక్ భాష, మురళీకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టాక్సీలకు బ్రేక్ విధానం కొనసాగించాలి



ప్రజాశక్తి- నందిగామ

టాక్సీ వాహనాలకు బ్రేక్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో టాక్సీ, కారు, ఆటో డ్రైవర్లు సోమవారం నందిగామ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ట్యాక్సీ నెంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలకు పాత పద్ధతిలోనే నందిగామ ఆర్జీవీ కార్యాలయం వద్దనే బ్రేక్ చేయించుకునేందుకు ఏర్పాటు చేయాలని కోరారు. నందిగామ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆటో, లారీ, కారు, మినీ వాహనాలకు ప్రతి సంవత్సరం ఆర్టీవో కార్యాలయం వద్ద బ్రేక్ చేసేవారని, ప్రస్తుతం విజయవాడ రూరల్ మండలంలోని నున్నలో ఒక ప్రైవేట్ ఏజన్సీ వారికి కేటాయించి అక్కడే బ్రేక్ చేయించుకోవాలని నిర్ణయించారని తెలిపారు. దీనివల్ల టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్యాక్సీ డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని గతంలో మాదిరిగానే నందిగామ ఆర్టీవో కార్యాలయం వద్దనే బ్రేక్ చేయించుకునేందుకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సయ్యద్ ఖాసీం, కరి వెంకటేశ్వరరావు,ఎస్ఎఫ్ఐ నాయకులు గోపీనాయక్,టాక్సీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొమ్ము పండు, వై నరసింహారావు, కస్తాల శేషగిరి, మోహన్ రావు, కరీయ్, సంజీవరావు, రాములాల్,జానీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



అదుపులోకి రాని అతిసార



- ఇంకా కొత్త కేసులు నమోదు
- నేటికీ 60 మందికి చికిత్స
- ఇళ్లకు వెళ్లి తిరిగి వస్తున్న కేసులు అనేకం
- అతిసారకు పోటీగా విషజ్వరాలు నమోదు
- న్యూఆర్ఆర్‌పేటలో కర్ఫ్యూ వాతావరణం

ప్రజాశక్తి-విజయవాడ: న్యూఆర్ఆర్‌పేటలో వారం రోజులు గడిచినా అతిసార అదుపులోకి రాలేదు. ఇంకా కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. జిజిహెచ్‌లో, కేర్ అండ్ షేర్ ఉచిత వైద్యశిబిరంలో 60 మందికి చికిత్స అందిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసిని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సోమవారం వరకు 313 అతిసార కేసులు రాగా వాటిల్లో 253 కేసులు డిశ్చార్జి అయినట్లు తెలిపారు. ఇదే క్రమంలో ప్రైవేటు వైద్యశాలల్లో కూడా అతిసార బాధితులు వైద్యం చేయించుకుంటున్నారు. అతిసార కొంత అదుపులో ఉన్నట్లు జిల్లా వైద్యాధికారులు వెల్లడిస్తున్నా అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేటు వైద్యశాలల్లో చేరి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నా వారు, ఇంకా వచ్చి చేరుతున్న వారి సంఖ్యను పరిశీలిస్తే ఇప్పుడే సాధారణ స్థాయికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని తెలుస్తుంది. ఇదే క్రమంలో ఎటువంటి ఆదరణ లేక, అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కొందరు నిరుపేదలు నీరశించి, తీవ్ర అస్వస్థతకు లోనై చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్ఎంపిల సలహాల మేరకు సొంత వైద్యంతోనే ఇళ్లకే పరిమితం అవుతున్న కేసులు కూడా అక్కడక్కడ ఉన్నాయని బాధితుల నుంచి సమాచారం. వాంతులు, విరేచనాలతో తిరిగి వైద్య శిబిరాలకు వచ్చి చేరుతున్న కేసులు కూడా నమోదవుతున్నాయి. డివిజన్‌లోని 60 ఏళ్ల వయసున్న నారాయణ ఆదివారం మధ్యాహ్నం కేర్ అండ్ షేర్ వైద్యశిబిరంలో చేరాడు. చికిత్స అనంతరం అతనికి బాగుందని రాత్రి తొమ్మిది గంటలకు డాక్టర్లు ఇంటికి పంపించగా, మరలా వాంతులు, విరేచనాలు ప్రారంభం కావడంతో సోమవారం తెల్లవారుజామున మరలా వైద్యశిబిరానికి వచ్చారు. ప్రతి ఇంటికీ ఒక్కో క్యాన్ చొప్పున మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నా డివిజన్ మొత్తం పూర్తి స్థాయిలో సరఫరా కావడం



లేదు. బోరు వాటర్ ఎర్రగా, మలినాలతో తుప్పుపట్టిన వాసనతో ఉండటంతో కనీసం వాడుకోవడానికి కూడా పనికి రావడం లేదని, స్నానానికి కూడా పనికి రావని ప్రజలు వాపోతున్నారు. డ్రైయినేజీ దెబ్బతినడం, పారిశుధ్యం కూడా పూర్తిస్థాయిలో మెరుగుదల కాకపోవడం, దోమలు, సరైన భోజన వసతి లేకపోవడం తదితర అనేక కారణాలతో వారం రోజులైనా అతిసార అదుపులోకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. మరొక వైపున మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు అతిసార కేసులకు పోటాపోటీగా నమోదవుతున్నాయని అధికారుల సర్వే రిపోర్టులు విధితం చేస్తున్నాయి. విషజ్వరాల బారిన పడుతున్న చిన్నారులు, వృద్ధులు ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలల్లో క్యూ కడుతున్నారు. ఒక వైపున అతిసార, మరొక వైపున విషజ్వరాలతో డివిజన్ ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

నేటికీ బయటపెట్టని నివేదిక

అతిసారతో న్యూఆర్ఆర్‌పేట గత వారం రోజుల నుంచి అట్టడుగిపోతున్నా దానికి గల కారణాలను వెల్లడించడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. దేనికి సంబంధించి అయినా 48 గంటలకే రిపోర్టు వస్తుందని స్వయంగా వైద్యాధికారులు తెలుపుతున్నా...నీటి కాలుష్యం లేక ఫుడ్ పాయిజన్, మరేదన్నా అతిసార రావడానికి కారణమా అనే విషయాన్ని స్పష్టం చేయడానికి వైద్యాధికారులు అసలు విషయాన్ని దాట వేస్తున్నారు. ఇదే అంశంపై సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుహాసినీని మీడియా ప్రశ్నించగా ఆమె నీళ్లు నములుతూ దాట వేశారు. ఒక సారి వచ్చిన రిపోర్టు నెగిటివ్‌గా వచ్చిందని, రెండు, మూడో సారి కూడా రిపోర్టులు వస్తాయని వచ్చిన వెంటనే వెల్లడిస్తామంటూ చెప్పారు.



రోడ్డుపై బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



మైక్ ప్రచారం నిర్వహిస్తున్న సిబ్బంది

అతిసారపై సిఎం సమీక్షించాలి

- వివెంసి అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ న్యూ ఆర్ఆర్‌పేటలో అతిసార వ్యాప్తి, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తక్షణమే ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు డిమాండ్ చేశారు. 57వ డివిజన్ న్యూఆర్ ఆర్‌పేటలోని ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి బాధితులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యం తీరును పరిశీలించారు. పూర్తి స్థాయిలో నయం అయ్యేంత వరకు వైద్యశిబిరం నుంచి వెళ్లవద్దని సూచించారు. ఈ సందర్భంగా బాబూరావు మీడియాతో మాట్లాడుతూ అతిసారపై సమగ్రంగా చర్చించి, దాని నివారణ, బాధితులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన నిర్ణయంపై తక్షణమే వివెంసి కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ఈ నెల 16న నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని అనివార్య కారణాలంటూ వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటన విడుదల చేయడం అత్యంత దారుణమన్నారు. డయేరియాతో మరణించిన వారి కుటుంబాలకు రూ.పది లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేయడంతో పాటు బాధితులు ఒక్కొక్కరికీ రూ.పది వేలు, వైద్య ఖర్చులు, నిత్యావసర సరుకులు ఇవ్వాలని కోరారు.



శిబిరంలో రోగులను పరామర్శిస్తున్న సిహెచ్ బాబురావు

ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం చేయించుకున్న వారికి బిల్లులు మొత్తం చెల్లించాలన్నారు. వారం రోజులు గడిచినా అతిసార ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఆర్ఆర్‌పేటలో సాధారణ పరిస్థితి ఇంకా నెలకొనలేదన్నారు. మంచినీటి కాలుష్యమని జనం గగ్గోలు పెడుతున్నా... ఇంత వరకు ఈ ఆధునిక కాలంలో ఎందుకు అతిసార వచ్చిందో నిర్ధారించడానికి పరీక్షలు ఇంకా పూర్తి కాలేదంటూ అధికారులు సమాధానాలు చెప్పడం దారుణమన్నారు. నీటి నమూనా పరీక్షలు పూర్తికాకపోవడం కాదు.. వాటిని కావాలని అధికారులు కప్పిపుచ్చుతున్నారని విమర్శించారు. అతిసార వ్యాప్తిలో ప్రభుత్వం, అధికారుల అసమర్ధత, వైఫల్యం స్పష్టంగా కనపడుతుందని ధ్వజమెత్తారు. న్యూఆర్ఆర్‌పేటలో నిత్యావసర సరుకులన్నీ ఉచితంగా అందించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నాయకులు చింతల శ్రీనివాస్, ఎంవి రమణ, మోహిద్దీన్ పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో అతిసార పూర్తి నియంత్రణలో ఉందని, ప్రభుత్వ చర్యలకు ప్రజాచైతన్యం తోడవడంతో కేసులు బాగా తగ్గుముఖం పట్టాయని, అయినా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 275 మంది చికిత్స తీసుకొని డిశ్చార్జ్ కాగా 42 మంది చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. కేర్ అండ్ షేర్ స్కూల్లో వైద్య శిబిరంతో పాటు న్యూ జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య బృందాల చికిత్స, ఇంటింటినీ జల్లెడపట్టడం, అవగాహన కల్పించడం, ఎవరికైనా రోగ లక్షణాలు ఉంటే సత్వరం స్పందించి సేవలు అందించడం, ఇంటింటికీ మినరల్ వాటర్ సరఫరా, ప్రచార సామగ్రితో అవగాహన కల్పన, విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు, హైజీన్ కిట్ల పంపిణీకి ప్రజా చైతన్యం తోడవడంతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. ప్రతి వార్డు సచివాలయానికీ ఒక జిల్లాస్థాయి అధికారికి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. ప్రత్యేక అధికారి నేతృత్వంలోని బృందాలు చివరి కేసూ కోలుకొని ఇంటికెళ్లే వరకు జాగ్రత్తగా ఉండాలని, నిరంతర పర్యవేక్షణతో ముందు కూడా అతిసార ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా అధికారుల నేతృత్వంలో 64 డివిజన్లకూ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.



ఘనంగా ఇంజనీరింగ్ డే వేడుకలు

విజయవాడ : 58వ ఇంజినీర్స్ డే వేడుకలను సోమవారం విజయవాడ గవర్నర్‌పేటలోని డాక్టర్ కెఎల్.రావు భవన్‌లో ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా), ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీప్ టెక్నాలజీల ద్వారా భారతదేశం గ్లోబల్ టెక్నాలజీ శక్తిగా ఎదగడానికి అవసరమైన మార్గాలను వివరించనున్నారు. "డీప్ టెక్ అండ్ ఇంజినీరింగ్ ఎక్సలెన్స్: డ్రైవింగ్ ఇండియాస్ టెకేడ్" అనే ఈ సంవత్సర థీమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, ఆధునిక మెటీరియల్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా దేశ అభివద్ధి వైపు దష్టి సారిస్తోందన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎల్ఎస్.దేవకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మీడియా ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శివన్నారాయణ, ఇమీడియేట్ పాస్ట్ ఛైర్మన్ డాక్టర్ సివి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ అలపాటి సూర్యనారాయణ, మలినేని నారాయణ ప్రసాద్, కె. పద్మజకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రతిభావంతుడు ఇంజినీర్ అవార్డును ప్రొఫెసర్ కొడాలి శ్రీనివాస్, డిస్టింగ్విష్డ్ ఇంజినీర్ (ఇండస్ట్రీ) అవార్డును ఇర్.ఎం. సత్యనారాయణ ప్రసాద్, డిస్టింగ్విష్డ్ ఉమెన్ ఇంజినీర్ అవార్డును సి.శోభా బిందు, డిస్టింగ్విష్డ్ ఇంజినీర్ (సోసైటల్ సర్వీస్) అవార్డును ఇర్.ఎం.శివ ప్రసాద్,డిస్టింగ్విష్డ్ ఇంజినీర్ (అకాడెమిక్స్) అవార్డును వి.శ్రీనివాస నరేష్, డిస్టింగ్విష్డ్ యంగ్ ఇంజినీర్ అవార్డును డాక్టర్ నవీన్ కుమార్‌లకు అందించారు. ఇంజినీరింగ్ రంగంలో విశేష కృషి చేసిన అవార్డు గ్రహీతలందరికి శివన్నారాయణ హదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

దేశ ఐక్యతకు పునాది 'హిందీ'

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విభిన్న భాషలు కలిగిన మన దేశానికి భిన్నత్వంలో ఏకత్వం సాధించడానికి, దేశ సమైక్యతకు హిందీ భాష పునాదిగా నిలుస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం హిందీ విభాగాధిపతి ఆచార్య కాకాని శ్రీకృష్ణ అన్నారు. కెబిఎన్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం హిందీ భాషా దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకష్ణ మాట్లాడుతూ సాహిత్య సంపద, సరళత, మాధుర్యం, సనాతన, ఆధునిక భావాల సమన్వయం తదితర గొప్ప లక్షణాల కారణంగా హిందీ మనదేశ భాషల్లో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకుందన్నారు. హిందీ సాహిత్యంలో తులసీదాస్, సూరదాస్, కబీర్, భరతేందు హరిశ్చంద్ర, మున్షీ ప్రేమ్‌చంద్ మొదలైన కవులు, రచయితలు అమూల్యమైన కవిత్వం, కథలు, నవలలు, నాటకాల రచించడం ద్వారా హిందీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ హిందీ ద్వారా ప్రజలు పరస్పరం తమ భావాలు, సంస్కృతులను పంచుకోవడం వల్ల జాతీయ ఐకమ్యత బలపడుతుందన్నారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.రామకృష్ణ, పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు అతిథి శ్రీకష్ణను సన్మానించారు. హిందీ అధ్యాపకులు కె.రేణుక, కె.శారద కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట :వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వరావు పుట్టినరోజును వేడుకలను వైసిపి నేతలు సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ రోగులకు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు, పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి శివరాత్రి పృథ్వీరాజ్ , జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు, జిల్లా రైతు విభాగ కార్యదర్శి మోరే దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

టైలర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి- నందిగామ



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

టైలర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని, సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నందిగామ మండల తహశీల్దార్ కార్యాలయంలో టైలర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ టైలరింగ్ వృత్తినే జీవనోపాధిగా చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పని చేస్తున్నారని తెలిపారు. రెడీమేడ్ వస్త్రాల రాకతో పనులు లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మిషన్ల కొనుగోలుకు ప్రభుత్వం లోన్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల యూనిఫారంలను స్థానిక టైలర్లతోనే కుట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. తిరుమలదేవి, షేక్ కరీమా, బి. నాగలక్ష్మి, సయ్యద్. గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ముచ్చినపల్లి గ్రామ అధ్యక్షునిగా సుగుణరావు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లి గ్రామంలో వైసిపి గ్రామ కమిటీని మండల పార్టీ అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముచ్చినపల్లి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా గంధం సుగుణరావు (చంటి), ఉపాధ్యక్షుడిగా మాచర్ల భాస్కర్రావు, సెక్రటరీగా తమ్మక్క నారాయణ, యువజన విభాగం అధ్యక్షుడిగా మత్తే విజయ్, గ్రామ పార్టీ గౌరవ సలహాదారుడిగా చీమల కాంతారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల వైసిపి అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

రైతులను ఆదుకోండి

• రైతు సంఘం నాయకులు



పొలాలను నాశనం చేస్తున్న నత్తలను చూపుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-మైలవరం : ఆరుగాలం రైతు కష్టపడి పండించిన పంటలను చేతికొచ్చే సమయానికి నత్తలు పాడు చేస్తున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వజ్రాల ధనలక్ష్మి, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని కొత్త మంగాపురం గ్రామంలో నత్తలు పాడు చేసిన మొక్కజొన్న, తదితర పంటలను సోమవారం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటను నత్తలతో పాటు కోతులు, కుక్కలు కూడా నాశనం చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నత్తల నివారించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శీలం వెంకటేశ్వర రెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాహినిలో ఇంజనీరింగ్ దినోత్సవం

ప్రజాశక్తి - తిరువూరు



తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీరింగ్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలు, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నాగేంద్రబాబు మాట్లాడుతూ కళాశాలలో ప్రాక్టికల్ నాలెడ్జ పెంపొందించడానికి అవసరమైన అన్నిరకాల అధునాతన లాబొరేటరీస్ అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, బిఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి వి.జె మోజెస్, కళాశాల డీన్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, సివిల్, మెకానికల్ విభాగాధిపతులు రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసంలో మా ప్రమేయం లేదు : వైసిపి

ప్రజాశక్తి-గంపలగూడెం

ఈ నెల 14న రాత్రి తోటమూలలో ఉన్న టిడిపి నాయకులు ఇనుగంటి రాంబాబు విగ్రహ ధ్వంసంలో వైసిపికి ఎటువంటి ప్రమేయంలేదని వైసిపి గంపలగూడెం మండల అధ్యక్షుడు కావూరి వినయ్ కుమార్ తెలిపారు.విగ్రహ ధ్వంసంపై టిడిపి నాయకులు చేసిన ఆరోపణలను ఆయన సోమవారం తీవ్రంగా ఖండించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసింది టిడిపికి చెందినవారేనని ఆరోపించారు. తోటమూలకు చెందిన ఒక మెడికల్ షాపుపై 200 మంది టిడిపి నాయకులు దౌర్జన్యం చేశారని, ఇటువంటి దౌర్జన్యాలు, కూల్చడాలు టిడిపికే చెల్లునని విమర్శించారు. తమ పార్టీ నాయకులపై చేసిన తప్పుడు ఆరోపణలను టిడిపి నాయకులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యుడు కోట సామ్యూల్, చెరుకు నరసారెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, అల్లు కృష్ణారెడ్డి, మందపాటి ఉమామహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట



లెగసీ వ్యర్థాల తొలగింపు పనులు సోమవారం జగ్గయ్యపేట మున్సిపాలిటీలో ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, మున్సిపల్ ఛైర్మన్ రంగపురం రాఘవేంద్ర ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రజలు వాయు కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛ ఆంధ్ర సహకారంతో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. లెగసీ వ్యర్థాల తొలగింపు ప్రక్రియ "బయోమైనింగ్" ద్వారా జరుగుతుందని, మండే వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలలో ఇంధనంగా వాడతారని, పునర్వినియోగం చేయదగిన వాటిని రీసైక్లింగ్ యూనిట్లకు పంపుతారని, ఈ పద్ధతి వ్యర్థాలను కేవలం తరలించడం కాకుండా, వాటిని పర్యావరణ హితంగా నిర్వహించడానికి దోహదపడుతుందని తెలిపారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి :పెనుగంచిప్రోలు మండలంలోని తోటచర్ల గ్రామంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 324 మంది వైద్య సేవలు పొందారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయప్రద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు, పెనుగంచిప్రోలు మండల పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, వేముల వెంకటేశ్వరరావు, సైదేశ్వరావు, జిల్లేపల్లి సుధీర, లక్ష్మి కుమారి, పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సిఫారసుతో పది మందికి సిఎం సహాయ నిధి సాయం మంజూరైంది. ఈ మేరకు మండలంలోని షేర్ మహ్మద్ పేట గ్రామానికి చెందిన గంగిరెడ్డి హారిక, భారతి, షేక్ జాన్ మియా, అనంతు ప్రసన్న, చెక్క నాగ వెంకట పురుషోత్తం, పల్లెబోయిన సురేష్, ఎరదేశి దానయ్య, చిట్టిప్రోలు సుశీల, బచ్చాటె ఉమా, చల్ల త్రివేణిలకు రూ.4,16,236 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాజగోపాల్ సోమవారం గ్రామంలోని బాధిత కుటుంబాలకు స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కట్టా వెంకట నరసింహారావు, పాల్గొన్నారు.



రెడ్డిగూడెంలో యూరియా పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం :రెడ్డిగూడెం పిఎసిఎస్ పరిధిలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి నాగేశ్వర రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు ఉయ్యూరు సుబ్బారెడ్డి, జానులపాటి వేణుగోపాల్ రెడ్డి, పిడపర్తి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పిడి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రెడ్డిగూడెం పిఎసిఎస్‌లో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వాకా రామచంద్రరావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తారన్న ఆశతో కూటమి పార్టీలను గెలిపిస్తే అధికారం చేపట్టిన తరువాత గీత కార్మికుల కోసం ప్రభుత్వం ఒక్క నూతన పథకం ప్రవేశపెట్టలేదని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్ర రావు ఆందోళన వ్యక్తంచేశారు. నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించాలని కోరుతుంటే మద్యం షాపులు, బార్లు పేరుతో భ్రమలు కల్పించారని, మద్యంషాపులు, బార్లు గీత కార్మికుల పేరుతో బడాబాబులు, మద్యం వ్యాపారులకు మేలు కల్పించారని ఆరోపించారు. గీత కార్మికులకు గత ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించినప్పటికీ విధివిధానాలు ప్రకటించకపోవడంతో అందని ద్రాక్షలా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ధరాఖాస్తుచేసుకు న్న గీత కార్మికులకు గుర్తింపుకార్డులు వెంటనే ఇవ్వాలని, మత్స్యకార బరోసా మాదిరిగా వత్తి సాగని సమయంలో కల్లుగీత బరోసా పథకం ప్రవేశపెట్టి రూ.25 ఇవ్వడంతో పాటు ఇతర డిమాండ్లు నెరవేర్చి సమస్యలు పరిష్కరించాలన్నారు. భూపతి బోడిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు పామర్తి వెంకటేశ్వరరావు, జిల్లా సంఘం అధ్యక్షుడు పలగాని నాగేశ్వరరావు, పామర్తి శ్రీను, వీరంకి నాగరాజు, తాతా శ్రీనివాసరావు, కొనకళ్ల వెంకట్రావు. జిల్లా నలుమూలలనుండి పెదసంఖ్యలో గీత కార్మికులు హాజరయ్యారు ఈ సదస్సుకు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు రైతు సంఘం జిల్లా నాయకులు కె. శివ నాగేంద్రం సంఘీభావం తెలిపారు.

గ్రామీణ యువతకు శిక్షణ : వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-ఉంగుటూరు : గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే యువతను పేదరికం నుంచి గట్టెక్కించి, వారికి కావాల్సిన శిక్షణ, మద్దతు ఇవ్వడమే స్వర్ణభారత్ ట్రస్ట్ లక్ష్యమని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఆయన విజయవాడ-ఆత్కూర్ స్వర్ణభారత్ ట్రస్ట్‌లో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలను గుర్తించి, వారికి శిక్షణ ఇచ్చి, వారి కాళ్లపై వారు స్వతంత్రంగా, గౌరవంగా నిలబడేలా ప్రోత్సాహి స్తోందన్నారు. ఆర్థిక స్తోమత లేని కారణంగా ఉన్నత విద్యకు దూరమైన యువతను గుర్తించి, వారికి ఉపాధి కల్పించే వత్తిపరమైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా పేదరిక నిర్మూలనకు స్వర్ణభారత్ ట్రస్ట్ దోహదం చేస్తోం దన్నారు. ఈ ట్రస్టులో ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, నర్సింగ్, మోటార్ రివైండింగ్, మొబైల్ రిపేరింగ్, ప్లంబింగ్, ఎయిర్ కండిషనర్ రిపేర్ వంటి కోర్సులు ఉన్నాయని, ఈ శిక్షణల ద్వారా యువత ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధారపడకుండా, స్వయం ఉపాధితో ఆత్మవిశ్వాసంతో జీవించవచ్చని చెప్పారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి-ఘంటసాల : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.దేవిన హరీష్ అన్నారు. సోమవారం ఘంటసాల, చినకళ్లేపల్లి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు 82 పశువులకు వేశారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద 4 నెలలు దాటిన ప్రతీ పశువుకు టీకాలు వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి సోకితే తీవ్రమైన జ్వరం, నోటి నుంచి తీగలమాదిరి చొంగ, నోరు, కాలిగిట్టల మధ్య పుండులగా ఉంటాయని తెలిపారు. మండలం మొత్తం 12382 టీకాలు వేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ గుత్తికొండ రామారావు, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాత సాయం అభినందనీయం : ఎంపిపి

ప్రజాశక్తి-మోపిదేవి : దాత సుధాకర్‌రెడ్డి మాస్టారు చేస్తున్న సామాజిక సేవలు ఎనలేనివని మండల పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి అన్నారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం మోపిదేవికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు రావిదుర్గా సుధాకర్ రెడ్డి రూ.60 వేలు సొంత ఖర్చులతో వాటర్ ట్యాంక్, డ్రైనేజీ ఆధునీకరణ పనులు చేపట్టి వాటిని పూర్తి చేశారు. సోమవారం పూర్తయిన వాటర్ ట్యాంక్, డ్రైనేజీ ఆధునీకరణ పనులను ఎంపీపీ దుర్గా వాణి, సర్పంచ్ అరజా సంధ్యారాణి, జడ్పిటిసి మెడబలిమి మల్లికార్జునరావు ప్రారంభించారు. అనంతరం సుధాకర్ రెడ్డి, సౌదామిని దంపతులను ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆశా దేవి, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ నాగలక్ష్మి,ఎంఈఓలు జి ఎన్ వి గోపాల్, ఏజి రమణ కాంప్లెక్స్ చైర్మన్ జి ఉమా పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలంలో 8,54,395 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మందికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పేదవర్గాలందరికీ వైద్య సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా గూడూరు మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమాలలో గూడూరు మండల తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల అధ్యక్షులు పోతన స్వామి, దాసరి ఉమా సాయిరాం, ఎస్ ఎ బేగ్,కోలపల్లి రజిని పాల్గొన్నారు.

జాబ్‌కార్డుల్లో ఆధార్ లింక్ చేసుకోవాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఉపాధి కోసం కూలీలు పేర్లు నమోదు చేయించుకోవాలని పమిడి ముక్కల ఏపీడీఓ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పమిడిముక్కల మండల మండల కార్యాల యంలో మాట్లాడుతూ ఉపాధి కూలీలు తమ జాబు కార్డుతో ఆధార్ కార్డు లింక్ చేయించుకోవాలని అన్నారు. మంటా డ, తాడంకి, లంకపల్లి, కృష్ణాపురం అన్ని గ్రామాల ఉపాధి కూలీలు పేర్లు నమోదు చేసుకొని లబ్ది పొందాలన్నారు.

పలువురిని పరామర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చల్లపల్లి: అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ సోమవారం చల్లపల్లిలో పలువురిని పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన గణేష్ ప్రెస్ నిర్వాహకులు ఒక్కలగడ్డ రాధాకృష్ణ, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి ఉప్పల మురళీమోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. విజయవాడ రోడ్డులోని అపార్ట్ మెంటులో టిడిపి నాయకులు సూరపనేని రవి మాతమూర్తి మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించిమతులకు సంతాపం, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం పడమర వైపు బొందలపాటి సుబ్రహ్మణ్యం మృతి చెందగా వారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సుబ్రహ్మణ్యం మతికి సంతాపం, కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుద్ధ ప్రసాద్ వెంట టీడీపీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, గ్రామ సర్పంచ్, ఏపీ ఇరిగేషన్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గలు ఉన్నారు.

పంటలకు ఈక్రాప్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో ఉద్యానవన శాఖ అధికారి ఎస్ రమేష్ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా పండ్లతోటలు, కూరగాయలు, పసుపు, ఆయిల్ పామ్ పంటలకు సబ్సిడీ వివరాలు తెలియజేశారు. అదేవిధంగా ఈ క్రాఫ్ ప్రతి రైతు తమ పంటలను నమోదు చేయించుకోవాలని నమోదు చేయించుకున్న రైతుకు ప్రభుత్వం సహకారం నష్టపరిహారం లాంటివి అందిస్తుందని తెలిపారు. కాగా వ్యవసాయ పనిముట్లు తైవాన్ స్ప్రేయర్స్ రోటో వటర్ పవర్ టిల్లర్, పవర్ విడర్ ఇతర వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఇంజినీర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాధారంగా సత్యం, కృషి, నిబద్ధత నేర్చుకుని దేశానికి ఉపయోగపడే ఇంజనీర్లుగా ఎదగాలని శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్ ఎన్వీ రమణ విద్యార్థులకు సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, జాతీయ ఇంజనీర్ దినోత్సవం పురస్కరిం చుకుని కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద వెంకటరమణ నివాళులర్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన వారాంతపు, గ్రాండ్ టెస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు వెంకటరమణ మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, అధ్యాపకులు పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యా లయం ఇంజనీరింగ్ కళాశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్యాంపస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. విజయ్ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష మాట్లాడారు. ఈ సందర్భంగా వర్సిటీ చీఫ్ ఇంజనీర్ జి.నాగేశ్వరరావును సత్కరించారు. ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకె సుందర కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-ఉంగుటూరు : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే వేడుకలు సోమవారం ఉషారామ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ అండ్ బి ఇంజనీర్ సిహెచ్. సుధాకర్‌రెడ్డి, ఐఐటిఇ చైర్మన్ డాక్టర్ బి సూర్య ప్రసాద్‌రావు, కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, కళాశాల ప్రిన్సిపాల్ డా. జివికెఎస్ వి. ప్రసాద్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్. బి. నాంచారయ్య, డీన్ అకడమిక్స్ డాక్టర్ సిహెచ్ శాంతిరాణి, డీన్ ఆర్ అండ్ డి సాగర్‌లు పాల్గొన్నారు.

యలవర్తిని సత్కరించిన లయన్స్ సభ్యులు

ప్రజాశక్తి - గుడివాడ : ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీరింగ్ గోల్డ్ మెడల్ పట్టభద్రులు, మాజీ మున్సిపల్ చైర్మన్, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావును గుడివాడ లయన్స్ క్లబ్ సభ్యులు ఆయన నివాసం వద్ద ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ విస్సంశెట్టి కృష్ణకిషోర్, ప్రెసిడెంట్ గుడివాడ వేణుగోపాలస్వామి, సెక్రెటరీ కిలారిశెట్టి సతీష్, ట్రెజరర్ కాసరనేని శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : సంత రోడ్డులోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎస్ఆర్జిఇ ఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ కరుణ కుమార్, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, లైన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఈడేపల్లి గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పిపి ఫణి కుమార్, ఇంజనీర్ ఆర్‌విఎస్ మురళీధర్, రిటైర్డ్ ఇంజనీర్ అగ్ని హోత్రం యోగానంద, గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ, నూకల సత్యనారాయణ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇంజనీర్లను సన్మానించారు.

పేర్ని నానిపై విమర్శలు సిగ్గుచేటు : కైలే



మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

ప్రజాశక్తి-పామర్రు : 15 నెలలు గా కూటమి ప్రభుత్వం అవినీతి పాలన సాగిస్తుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే వైయస్సార్సీపి రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆరోపించారు. సోమ వారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా ఇటీవల మాట్లాడుతూ మాజీ మంత్రి పేర్ని నానిపై అవినీతి విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ ఎమ్మెల్యే ఎక్కడ ఇసుక దోచుకుందామా.. ఎక్కడ భూమి ఆక్రమించుకుందామా అని చూస్తా ఉంటాడన్నారు. లంకపల్లి గ్రామంలో 600 ఎకరాల భూమినీ రీ సర్వే పేరుతో తన బంధువుల పేర్లు ఎక్కించి కొట్టేయడానికి రెడీ అయ్యాడని అన్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు నడుపుతూ గ్రామానికి ఒక ఏజెంట్ని పెట్టుకుని సాయంత్రానికి వసూలు చేపించుకుంటున్నావన్నారు. పామర్రు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొండలమ్మ దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరంలో ఉన్నకొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకపు ఉత్తర్వులను దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ జారీ చేసినట్లు ఈఓ ఆకుల కొండలరావు సోమవారం తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా ఈడే వెంకట విష్ణు మోహనరావు, తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్డమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మి పావని, రుద్రపాటి శేషగిరిరావు, ఫ్రవిత్రస్తంభ శివ సంతోష్ శర్మ, (ఎక్స్ -ఆఫీషియో మెంబర్) నియమితులయ్యారన్నారు. వీరిచే ఈనెల 17వ తేదీ బుధవారం ఉదయం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని నియమించాలని వినతి

ప్రజాశక్తి-పమిడిముక్కల : రైతు సేవా కేంద్రంలో ఈ క్రాప్ చేసే సిబ్బందిని నియమించాలని జిల్లా రైతు సంఘం సభ్యులు కొల్లి వెంకటరామయ్య అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని లంకపల్లి గ్రామంలో పంట పొలాలను ఈ క్రాప్ చేసే సిబ్బంది లేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే రైతులందరికీ యూరియా అందించాలన్నారు. కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, మండల తహసీల్దార్ నవీన్ కుమార్‌లను కలిసి విజ్ఞప్తి చేశారు.



విజయవాడ తరలిన బిల్డింగ్ వర్కర్లు

ప్రజాశక్తి-అవనిగడ్డ : సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూని యన్(సిఐ టియు) కృష్ణా జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమ వారం అవనిగడ్డకు చెందిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సభ్యులు లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు తరలి వెళ్లారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యాసం శ్రీనివాస రావు సమక్షంలో మండల ఉపాధ్యక్షులు మాదాసు కుమార్, సభ్యులు బండారు చంద్రయ్య లతోపాటు పలువురు బిల్డింగ్ ఇతర కన్స్ట్రక్షన్ వర్కర్లు తరలి వెళ్లారు.

యాత్రికులకు సౌకర్యాల కల్పనపై దృష్టి

- దేవాదాయ శాఖ కమిషనర్

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

ప్రతిష్టాత్మకంగా జరుగబోయే ఇంద్రకీలాద్రి శ్రీ కనక దుర్గ అమ్మవారి దసరా ఉత్సవాలకు అన్ని విధాలా అధికారులు సన్నద్ధమై, యాత్రికుల సౌకర్యాల విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉండాలని దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ అన్నారు. దసరా ఏర్పాట్లను ఈవో శీనా నాయక్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కనకదుర్గా నగర్, కొత్త లడ్డు పోటు, అన్నదానం భవనం తదితరాలను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ దేవస్థానం ఆవరణలో జరుగుతున్న పనుల్లో 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను అదనపు కార్యనిర్వాహక ఇంజనీర్ల సహకారంతో 48 గంటల్లోగా పూర్తి చేసి, ఫిట్నెస్ సర్టిఫికెట్లను సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు



పేర్కొన్నారు. రాబోయే దసరా ఉత్సవాల్లో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా రద్దీ నిర్వహణ, పారిశుద్ధ్యం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. దసరా ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా, యాత్రికులకు సంతప్తికరంగా జరిగేలా చూడాలని, ఏర్పాట్లులో రాజీ పడవద్దని, యాత్రికుల సంతృప్తి ప్రధానంగా ముందుకు సాగాలని కమిషనర్ స్పష్టం చేశారు.

రూ.లక్ష నగదు చోరీ

ప్రజాశక్తి - తిరువూరు

గుర్తు తెలియని కారు అద్దాలు పగలగొట్టి రూ.లక్ష నగదు దోగిలించిన సంఘటన సోమవారం తిరువూరు పట్టణంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఎర్రమాడుకు చెందిన మొగిలి సురేష్ బ్యాంక్ నుండి లక్ష రూపాయలు డ్రా చేసుకుని ఏపి 39 డిజెడ్ 5858 నెంబర్ గల కారులోని డాష్ బోర్డులో పెట్టుకున్నారు. జాతీయ రహదారిపై కారు పక్కన నిలిపి మంచి నీళ్ల బాటిల్ కోసం ఓ షాపునకు వెళ్లారు. సురేష్ కదికలను గమనిస్తూ వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు సురేష్ లేని సమయంలో కారు అద్దాలు పగలగొట్టి రూ.లక్ష నగదును దొంగిలించి పరారయ్యారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ సత్య నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

విజయవాడ : పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌషికాహారం అందించాలని పలువురు ప్రముఖులు తెలిపారు. నవజీవన్ బాల భవన్ తరపున బావాజిపేట యువ భవన్‌లో సోమవారం మాల్ న్యూట్రిషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అజీమ్ ప్రేమ్ జి, అమిత్ దాస్, అడ్మినిస్ట్రేట్ డైరెక్టర్ మర్రెడ్డి, నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోసెఫ్ తంబి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంతయ్య, మర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ దాస్ మాట్లాడుతూ.. ఎస్‌టిల్లో పౌష్టికహారం లోపం ఉన్న పిల్లలను గుర్తించి నవజీవన్ బాల భవన్ సంస్థ ద్వారా పౌష్టికాహారం అందజేసినట్లు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలను పెంచుతుందని, బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు న్యూట్రిషన్ ఫుడ్ అందిచడం జరిగిందని తెలిపారు. ఈ నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ ఎండి వసంతకుమారి, డాక్యుమెంటేషన్ ఇంచార్జ శ్రావణ్ కుమార్, నర్స్ సునీత తదితరులు పాల్గొన్నారు.



'ఫిజిక్స్ వాలా' నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ గురునానక్ రోడ్‌లో ఫిజిక్స్‌వాలా పీడబ్ల్యూ విద్యా సంస్థ రాష్ట్రంలో తొలి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఇండియా హెడ్ అమిత్ సింగ్ రాథోర్, రీజినల్ అకాడమిక్ హెడ్ సంజయ్ కుమార్ శర్మ, విజయవాడ కేంద్రం నిర్వాహకులు సుధాకర్ రెడ్డి తదితరులు రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ సింగ్ రాథోర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు విద్య కూడళ్ల అని, విద్యార్థులు ఎన్నో ఆకాంక్షలతో నీట్, జేఈఈకు సన్నద్ధం అవుతుంటారని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దష్టిలో ఉంచుకొని, వారికి కౌన్సిలింగ్ చేసేందుకు సమాచార కేంద్రాన్ని విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు. ఆఫ్‌లైన్ విద్యాపీఠ్ సెంటర్‌ను విజయవాడలో ప్రారంభించేందుకు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. నీట్, జెఈఈ ఫౌండేషన్ కోర్సులకు శిక్షణ పొందేందుకు సిద్ధం అవుతున్న విద్యార్థులు ఎస్ఎస్ఎటి స్కాలర్ షిప్ పరీక్షను రాసి వందశాతం ఉపకారవేతనాన్ని పొందవచ్చన్నారు. పిడబ్ల్యూ అండ్ జెవి. పార్టనర్స్ సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ జేఈఈ, నీట్ వంటి పరీక్షలపై కౌన్సెలింగ్ పొందడానికి విద్యార్థులు సమాచార కేంద్రాన్ని సందర్శించవచ్చన్నారు.

విలక్షణంగా ఆలోచించేవారే ఇంజనీర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్: ఇంజనీర్ల విలక్షణ ఆలోచనలను నిత్యం కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేసే ప్రత్యక్ష పరిష్కారాలుగా మార్చే ఆవిష్కరణల రూపశిల్పులని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని ఓ హెూటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగర ప్రముఖులు రాజేష్ మాట్లాడుతూ అభివృద్ధి చేయడం వంటి సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి వారు సాంకేతిక నైపుణ్యాన్ని సృజనాత్మకతతో మిళితం చేస్తారని తెలిపారు. అమెజాన్‌లో, ఇంజనీరింగ్ నైపుణ్యం వినియోగదారుని పట్ల శ్రద్ధకు పునాది వేస్తుందన్నారు. అమెజాన్ ఆవిష్కరణల వెనుక ఇంజనీర్లు చోదక శక్తిగా ఉన్నారని తెలిపారు.

మాక్స్‌క్లీన్ ఫ్లోర్ క్లీనర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ హౌస్‌కు చెందిన ప్రముఖ బ్రాండ్ మాక్స్‌క్లీన్ ఫ్లోర్ క్లీనర్, తన తాజా ఆవిష్కరణగా మాక్స్‌క్లీన్ 2-ఇన్-1 ఫ్లోర్ క్లీనర్‌ను విడుదల చేసిందని సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉషా సింగ్ తెలిపారు. నగరంలోని ఓ హెూటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇది శాస్త్రీయంగా రూపొందించ బడిన క్రిమిసంహారకమని, ఇది సాధారణ ఫ్లోర్ క్లీనర్‌లా గచ్చును క్రిమిరహితం చేసి కఠినమైన ధూళి, దుమ్మును తొలగించడమే కాకుండా కీటకాలను కూడా అడ్డుకుంటుందని తెలిపారు. శుభ్రత, పరిశుభ్రతను ఒకే అనుకూలమైన దశలో కలపడం ద్వారా రోజువారీ గహ సంరక్షణకు తెలివైన, మరింత సమగ్రమైన విధానాన్ని అందిస్తుంది అన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం

- ఇగ్నో రీజినల్ డైరెక్టర్ సుమలత

ప్రజాశక్తి -విజయవాడ సిటీ

పరిశుభ్రమైన పరిసరాలు వ్యక్తుల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా సమాజంలో సానుకూల దక్పథాన్ని పెంచుతాయని, పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత అన్నారు. ఇగ్నో ఆధ్వర్యంలో సోమవారం కెబిఎన్ కళాశాలలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పర్యావరణ పరిశుభ్రత పాటించాలన్నారు. హానికరమైన ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ చెత్తను తగ్గించడం, వనరులను వృథా చేయకుండా వినియోగించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి అలవాట్లు అలవరచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని



కాపాడుకోవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకష్ణ మాట్లాడుతూ మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం వల్ల కేన్సర్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్లాస్టిక్ వినియోగం, పరిశుభ్రత అంశాలతో కూడిన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ పి.శరచ్చంద్ర, ఇగ్నో స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు షూరిటీ లేకుండా రుణాలివ్వాలి

- ధర్నాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి

ప్రజాశక్తి-ఉంగుటూరు

సిసిఆర్‌సి కార్డు ఉన్న ప్రతి కౌలురైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఏ విధమైన షూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద కౌలు రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సుమారు 400 మంది రుణాలు తీసుకుని తిరిగి చెల్లించడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. నూతనంగా వచ్చిన స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్ కౌలుదారులకు సిసిఆర్‌సి కార్డుపై రుణం ఇవ్వాలంటే ఖచ్చితంగా షూరిటీ కావాలని, ఒక రైతుకు 50 వేలకు మించి ఇవ్వడం కుదరదని చెబుతూ వాయిదాలు వేస్తున్నారని తెలిపారు. వరి పైరుకు మందులు వేయడానికి అదును పోతుందని, కౌలురైతుల దగ్గర ఉన్న డబ్బులతో బ్యాంకులో ఉన్న అప్పులు చెల్లించారని, మరలా రుణం కోసం వస్తే మంజూరు చేయకుండా సాకులు చెబుతున్నారని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్కేల్ ఆఫ్ ఫైనాన్సును పెంచుతూ రెండు లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని నిర్ణయం చేసిందని, ఆ మేరకు స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బిసి) రుణాలిచ్చేందుకు అంగీకరించిందని, ఈ నిబంధన ప్రకారం కౌలు రైతులకు రుణాలివ్వాల్సిన బాధ్యత బ్యాంకు



అధికారులపై ఉందన్నారు. దానికి భిన్నంగా ఉంగుటూరు కెనరా బ్యాంకు మేనేజర్ అనవసర నిబంధనలతో రుణాలు మంజూరు చేయడంలేదని, దీంతో కౌలు రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కౌలు రైతుల ఆందోళనతో బయటకు వచ్చిన బ్రాంచ్ మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ తమకున్న నిబంధన ప్రకారం ప్రతి రైతుకి 50 వేల రూపాయలు రుణమిస్తున్నామని, షూరిటీ అనివార్యమని అన్నారు. సమస్యను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు అర్హులందరికీ రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు సలీం, మాగంటి సాంబశివరావు, టివి రామ్మోహన్‌రావు, పిల్లి రాజారావు, రెడ్డయ్య పాల్గొన్నారు.



జోగి రమేష్‌ను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ఎన్‌టిటిపిఎస్ నుండి వెలువడుతున్న కాలుష్యంపై జిల్లా కలెక్టర్, సిపికి వినతిపత్రం ఇచ్చేందుకు సోమవారం పార్టీ నాయకులతో కలిసి బయలుదేరిన మాజీ మంత్రి జోగి రమేష్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఇబ్రహీంపట్నం సర్కిల్ వద్ద పోలీసులు జోగి రమేష్ వాహనాన్ని నిలుపుదల చేశారు. దీంతో జోగి రమేష్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగానే తమను అడ్డుకుంటున్నారని తెలిపారు. వైసిపి శ్రేణుల ఆందోళనతో ఎట్టకేలకు పోలీసులు జోగి రమేష్ కారును ముందుకు పంపించారు. అనంతరం డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ద్వారా వెలువడుతున్న బూడిద కాలుష్యం కారణంగా మూలపాడు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక లారీ ఓనర్లకు ఫ్రీ లోడింగ్ వల్ల ఇబ్బందులు తప్పడంలేదని, అనాధికారంగా బూడిద డంపింగ్ యార్డులు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జెసికి వినతి పత్రం అందజేశారు.